


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

*కనిపించని దేవుడు కన్నా... కనిపించే దెయ్యం మిన్న*

**నాకు పాత** సినిమాలు చూడడం చాలా ఇష్టం. నాలుగు రూపాయిలు అప్పుకోసం, పదిరూపాయిలు ఫీజ్ కట్టడం కోసం హీరో చాలా అవస్థలు పడ్తాడు. "నలభై రూపాయిల జీతంతో ఈ ఇల్లు ఎలా గడపను?" అని ఓ బడిపంతులు బాధపడితే, వెయ్యి రూపాయిల జీతం ఆఫీసర్ పెళ్ళాం కార్లో తిరుగుతూ వుంటుంది. ఇంటి నిండా నౌకర్లూ చాకర్లూ వుంటారు.

నేను రూపాయి ఇచ్చి ఆర్టీసీ క్రాస్ రోడ్స్ నుండి లోపలున్న మా కాలనీకి రిక్షాలో వచ్చేదాన్ని అంటే మా పిల్లలు నమ్మరు "అంత ఉతారే వుంది... అర్ధరూపాయి ఇస్తా" అనేదాన్ని. వెళ్ళేటప్పుడు "అంతా చడావ్ వుంది రూపాయి పావలా ఇవ్వండమ్మా" అంటే ఒప్పుకునేదాన్నికాదు.

సందానీ తల్లికి రోజుకి రెండు రూపాయిలిచ్చేవారు బీడీలు చేస్తే. "నెలకి అరవై రూపాయిలు" అని గర్వంగా చెప్పుకునేది. ఆ మొగుడికి ఎలక్ట్రీషియన్‌గా నెలకి మూడొందలొచ్చేవి. కానీ చిన్నిల్లూ, పెద్దిల్లూ అక్కడా ఇక్కడా ఇవ్వలేక ఇచ్చినా చాలవని రోజూ మూడు రూపాయిలు పెట్టి తాగి పడుకునేవాడు. ఇంతోటి మొగుడుకి రోజూ పావలాపెట్టి గుడ్లు కొని ఆమ్లెట్ వెయ్యాలి. వారానికి రెండుసార్లు మాంసం కూర లేదని వాళ్ళమ్మని ఎముకలు విరిగేటట్లు కొట్టేవాడు.

ఎదురింట్లో తెల్ల చిట్టితల్లి చిన్న సంచి పట్టుకుని, రిసాలా గెడ్డమీదకి వెళ్ళి, రెండు గుడ్లూ, పావుకిలో కిరోసిన్, చటాకు కారం, ఉప్పు ప్యాకెట్, పావలా టమాటాలూ, అర్ధపావు కందిపప్పూ, చటాకు చింతపండు, మంచి నూనె ఇలా తెస్తూనే వుండేది.

నెలకోసారి అమ్మమ్మ రెండొందలు పెట్టి, రిక్షానిండా బియ్యం బస్తాతో సహా సరుకులు వేయించుకుని, అటూ ఇటూ వింజామరల్లా చీపురు కట్టలతో, రథంలో వచ్చే విక్టోరియా మహారాణిలా కాళ్ళ దగ్గర బోలెడు పప్పులూ, ఉప్పులూ సంచులతో, ఊరేగుతూ రావడం చూస్తే మాకు ఆ పెద్దావిడ అన్నిసార్లు దుకాణానికి, అతి నీరసంగా, కొంగు మెడచుట్టూ కప్పుకుని దగ్గుకుంటూ వెళ్ళి రావడం ఆశ్చర్యమేసేది.

తర్వాత వాళ్ళ ఆఖరిది పాపతో స్నేహం చేసాక తెలిసింది. పెద్దన్న వచ్చి రెండు రూపాయిల కాయితం ఇస్తే వాడికి సరుకులు తెచ్చి వంట చేసేదిట. చిన్నక్క వచ్చి "చికెన్ వండు" అని ఐదురూపాయల కాయితం ఇస్తే, అందుకు కావలసిన సరంజామాకి మళ్ళీ బజారుకి వెళ్ళేదిట.

ఎంతసేపూ మా కొంపల్లో సంవత్సరానికి సరిపడా పోపు దినుసులూ, నెలకి సరిపడా సరుకులూ, చూసే నాకు కొంచెం దిగువ తరగతి, ఇంకా దిగిపోయిన సందానీలాంటి వాళ్ళ కుటుంబాలూ చూస్తే మహా జాలిగా వుండేది.

పళ్ళు తోముకోడానికి సందానీగాడికి పొయ్యిలో కచ్చికా, బొగ్గూ, ఒళ్ళు రుద్దుకోడానికి బట్టల సబ్బు, అదీ వారానికి ఒకసారి. తల రుద్దుకోడానికి 'నిర్మా'. అయినా వాళ్ళమ్మకి పెద్ద జడ వుండేది. అవసరం వున్నా లేకపోయినా, సందానీనీ, వాడి తమ్ముడినీ, చెల్లెలినీ అందరినీ ఆర్.టీ.సీ ఆస్పత్రికి తీసుకెళ్ళి, వీడికి ఆకలెక్కువా, దీనికి నీరసం, నాకు ఆయాసం, 'బలీనం అస్సలు లేదు'(అంటే బలం లేదని భావం పాపం) అని బోలెడు మందులు రాయించేది వాళ్ళమ్మ. అన్నం పెట్టలేని రోజున గుప్పెడు విటమిన్ టాబ్లెట్లు ఇచ్చి మింగమనేది. యండమూరిగారు, రాబోయే శతాబ్దాల్లో అందరూ ఆకలేస్తే పిల్స్ మింగుతారూ, కేన్‌లో ఫుడ్స్ వేడి చేసుకుని తింటారూ అని 'ఆనందో బ్రహ్మ'లో రాసింది నిజమే. ఆనాడే చేసేది సందానీ తల్లి.

మా పనిమనిషి శ్యామలమ్మ "నీ కూతురెప్పుడు తలంటు పోసుకుంటుంది?" అంటే సాగదీస్తూ, చప్పరించి "బెస్తవార.. బెస్తవార" అనేది. కోడలు తలకి ఎప్పుడు పోసుకుంటుంది అంటే యమా ఫాస్ట్‌గా "దివ్లి దివ్లీ దివ్లి దివ్లీకి" అనేది. అంటే దీపావళి, దీపావళికీ అని అర్థం. అలా వుండేది లేనివాళ్ళ జీవితం.

సాయంత్రం దీపాలు పెట్టాక, మా అన్నయ్యల క్లాస్‌మేట్ ఒక అబ్బాయి వచ్చి వేప చెట్టుకింద నిలబడి "రామూ..మురళీ" అని పిలిచేవాడు. వీళ్ళు చకచకా లోపలికెళ్ళి, ఇత్తడి గిన్నెలోంచి అన్నం, కూరలూ, వీలైతే పప్పూ ఒక విస్తరాకులో పెట్టి తీసుకెళ్ళి ఇచ్చేవాళ్ళు. అక్కడే నిలబడి తినేసి, చెంబుతో నీళ్ళు ఇస్తే తాగేసి వెళ్ళిపోయేవాడు. పగలు ఎవరో టీచర్ రోజూ ఇంటినుండి సత్తు క్యారేజ్‌లో అన్నం, పప్పుచారూ తెచ్చి ఇచ్చేదట మహా తల్లి. సాయంత్రాలు ఇలా ఒకొక్క క్లాస్‌మేట్ ఇంటికి వచ్చి తినేవాడు. అమ్మమ్మ "రోజూ మనింటికే రమ్మనురా" అనేది. ఆ అబ్బాయి ఒప్పుకునేవాడు కాదుట. మాతో ఎన్నడూ వరండా మెట్లెక్కి మాట్లాడి ఎరగడు.

సినిమాకి వెళ్ళాలి అనగానే బుజ్జీ, చిట్టీవాళ్ళు, నల్లాకింద తలపెట్టి, సబ్బేసి రుద్దికడుక్కుని, స్టైలుగా పోనీటైల్ కట్టేసి వచ్చేవాళ్ళు. అప్పుడు మా ఇళ్ళల్లో పోనీటైల్ నిషిద్ధం. జుట్టు చివర్లు వదులుతే దెయ్యాలు పడ్తాయి అనేది మా అమ్మమ్మ.

ఓసారి సందానీ జేబులో బఠానీలు నోట్లో వేసుకుంటూ వచ్చి "మా అమ్మ అన్నం చెయ్యలే. మాదీ మామాకీ బేటీకీ దెయ్యం పట్టినయ్" అన్నాడు.

"జుట్టు చివర్ల వదిలేసిందా?" అన్నాను భయంగా. నేను చివర రిబ్బన్ బిగించుకుంటూ.

"రిషీకపూర్ సినిమా చూసినయ్" అన్నాడు. అప్పట్లో బాబీ పెద్ద హిట్. నేను నోరంతా తెరిచి "అయితే? అది దెయ్యం సినిమానా?" అన్నాను.

"అది లవ్ సినిమా" అని కిసుక్కున నవ్వాడు.

నేను బతిమాలుతూ "నాకు చూపించవా నేనెప్పుడూ దెయ్యం పట్టిన వాళ్ళని చూడలేదు" అన్నాను.

"సరే..రా.. కానీ నాకు టెంకాయ చిప్ప ఇస్తావ్?" అన్నాడు.

వాడికి ఆకలేస్తోందని తెలిసి నేను వంటగదిలోకెళ్ళి కొబ్బరి చిప్ప తీస్తుంటే గడపమీదే తలపెట్టుకుని వంటింట్లో పడుకునే మా అమ్మమ్మ పోలీసులా పట్టేసింది. "ఎందుకే కొబ్బరి చిప్ప?" అంది.

"సందానీ వాళ్ళమ్మ అన్నం వండలేదు. వాళ్ళ మామ కూతురికి దెయ్యం పట్టిందట." అని ఆసక్తిగా చెప్తుంటే "నోర్మూయ్ వెధవ కబుర్లూ మీరూను. నాలుగు వాతలు పెడితే అన్నీ దిగుతాయి" అని అమ్మమ్మ లేచి, ఓ విస్తరాకు తీసుకుని, అందులో అన్నం, పప్పూ, ఆవకాయ వేసి, వసారాలో పెట్టి, "వాడినొచ్చి అన్నం తినమను" అంది.

వాడు అన్నం తిన్నాకా, క్రీస్తుమణి టీచర్ పిలుస్తోందట. అని అబద్ధం ఆడి వాడివెంట తుప్పల్లో, పుట్టల్లో పడి, మధ్యలో వచ్చిన వాళ్ళ బొందల గడ్డ (వాడి భాషలో) దాటుకుంటూ వాడి మామ ఇంటికెళ్ళాను.

వాడి మామ కూతురు పేరు షాహీన్‌బాను. చుట్టూ బోలెడుమంది జనం గుమికూడి వున్నారు. అందులో సందానీ వాళ్ళ అమ్మా, నాన్న కూడా వున్నారు.

అది తల విరబోసుకుని వూగుతోంది. "వానికీ నేనూ షాదీ చేస్కుంటాయ్" అంది, ఎదురుగా వున్న భూతవైద్యుడితో. ఆయన భూతంకన్నా భయంకరంగా వున్నాడు. మొహం నిండా కుంకుమ, జడలు కట్టిన జుట్టు, జబ్బలకి విభూతీ, ఎర్రటి చింతనిప్పుల్లాంటి కళ్ళూ, ఇప్పసారా తాగిన వాసనా గోచీలాంటి బట్ట మాత్రం కట్టుకుని అటూ ఇటూ వూగేస్తున్నాడు. జ్యోతిలక్ష్మీ, జయమాలినీ ఒకేసారి పట్టినట్లు మధ్య మధ్యలో ఆ అమ్మాయి మీదకి చేతినిండా బూడిద తీసి విసుర్తున్నాడు.

ఆ అమ్మాయి సిల్క్ స్మిత కూడా వంటిమీదకొచ్చినట్లు, ఇంకా పెద్ద షేక్ ఇచ్చి "రిషీకపూర్‌కీ నాకీ లగ్గం చేస్కుంటాయ్" అంది.

"నై.. " అన్నాడు వాళ్ళబ్బా జాన్.

"హా" అంటే మాత్రం రిషికపూర్ వచ్చి పెళ్ళి చేసేసుకుంటాడా? రాజ్‌కపూర్ వప్పుకుంటాడా? నీతూ సింగ్ ఇంకా రాలేదు అనుకోండీ. డింపుల్ కపాడియాతో క్లోజ్ గా వుండేవాడు. "ఆ అమ్మాయిని రాజేష్ ఖన్నా ఎలా పెళ్ళి చేసుకుంటాడో రిషికపూర్‌తో చిన్న చిన్న బట్టలు వేసుకుని ఏక్ట్ చేసింది. " అంటూ మా అక్కలు తెగ చెవులు కొరుక్కున్నారు అప్పట్లో. వీళ్ళకీ రాజేష్ ఖన్నా దెయ్యమేనేమో.

భూతవైద్యుడు బియ్యంలో రూపాయి పెట్టమని వాళ్ళ అమ్మీ కేసి చూసి హూంకరించాడు.

రూపాయి పెట్టి బియ్యం కొనలేనివాళ్ళు వీడికి బియ్యంలో రూపాయి పెట్టాలిట. వాడి పొట్ట తిప్పలు వాడిది. వీళ్ళ కడుపు తీపి వీళ్ళదీ. మొత్తానికి "దిగుతావా? దిగవా?"

"దిగనూ" అనే ఆట ఇద్దరూ ఆడాకా, పక్కనున్న వేపమండలు పెట్టి ఆ పిల్లని బాదడం మొదలు పెట్టాడు. దాంతో "దిగుతా.. దిగుతా" అంది.

"ఈ పిల్ల రిషీకపూర్ సినిమా చూసి, ఇంట్లో చూసిన సంబంధం నచ్చక బావిలో పడి చచ్చింది. ఆ దెయ్యం ఈ పిల్లని పట్టింది" అని భూతవైద్యుడు చెప్పి, ఓ సీసా బిరడా తిసి అందులో సాంబ్రాణి పొగని పట్టి, బిరడా వేసి, "దీన్ని అలహాబాద్‌కి తీసుకుపోయి సమాధి చేస్తా. నలభైరూపాయలియ్యి" అన్నాడు.

ఆ పిల్ల తండ్రి పదినోటు పెట్టి "ఇంతే వున్నయ్ సామీ" అని కాళ్ళమీద పడ్డాడు.

"అయితే వరంగల్ పోతా!" అని వెళ్ళిపోయాడు.


షాహీన్ బానూ సొమ్మసిల్లిపడిపోయింది. మొహం మీదా, కాళ్ళూ చేతుల మీదా వాతలు పాపం. దీనికే ఆ తర్వాత మళ్ళీ జాకీష్రాఫ్ దెయ్యం కూడా పట్టింది. అంటే 'హీరో' సినిమా చూసి చచ్చిన ఆడ దెయ్యం పట్టింది. ఇది ఒంటిమీద 'టులెట్' బోర్డులు పెట్టుకు తిరుగుతున్నట్లు.

నాకనుమానం ఈ సీసా వరంగల్‌లోనే పాతిపెడితే ఆ దెయ్యం ఏ లారీనో ఎక్కి వచ్చేస్తుందేమోనని.

అసలీ దెయ్యాలన్నీ పాపం లేనివాళ్ళనే చూసి పడ్తాయో ఏమో?

మా శ్యామలమ్మకీ వస్తుంది దెయ్యం. మొదటి మొగుడు పిల్లల మీద కోపం వస్తే, మొదటి మొగుడూ, రెండో మొగుడి పిల్లల మీద కోపం వస్తే రెండో మొగుడు ఒంటిమీద కొస్తారు. వాళ్ళని చచ్చేట్లు చీపురుతో కొడ్తూ, ఓసారా సీసా పట్టిస్తుంది.

ఓసారి మా అమ్మమ్మ "నీకు ఆస్పత్రిలో షాక్ లిప్పిస్తాను. దెయ్యం గియ్యం వదిలిపోతుంది. ప్రతినెలా పట్టే దెయ్యాలేవిటే?" అని కోప్పడితే, నవ్వి "ఏం చెయ్యను పంతులమ్మా, పిల్లలు బతికుండి అన్నం పెట్టే అమ్మ మాట వింటలేరు. చచ్చిన అయ్యమాట తప్ప" అంది. అవీ దెయ్యం కబుర్లు.




Post your comments

https://www.youtube.com/watch?v=ERaaX_IulS4

